
# బంగరు కల

నేటి నిజం...



'చిరునవ్వుల వరమిస్తావా... మరుజన్మకు తోడుంటావా!
మనసు పూదోటలో మల్లెలు పూయిస్తే... మననం చేసుకుంటూ మరణిస్తా!!'

నా జంగయ్య మాటని, జంగయ్యని మరిచిపోవాలంటే బహుశా ఈ ప్రాయం హరించుకుపోవాలేమో! కటువైన ఆ మాట వెనుక కనికరం... కఠినమైన ఆ చూపు వెనుక కోమలం నిండివుండేవి. నిఖార్సయిన ఆ నిజాయితీ నన్ను జీవితాంతం అతనికి తోడుగా నిలబెట్టింది.

'టీకొట్టు జంగయ్య' అంటే అక్కడి వాళ్ళందరికీ ప్రాణం! ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే అతని మాటంటే అవినీతికి హడల్, స్వార్థానికి సవాల్!

'యథార్థవాది లోకానికి విరోధి' అవుతాడంటారు. జంగయ్య లేని ఒంటరిజీవితాన్ని సాగించడం అలవాటు చేసుకొని పదిహేను సంవత్సరాలు పైబడ్డా- అతను నన్ను నిరంతరం వెన్నంటి ఉన్నట్లే ఉంటుంది. నాకు 'తోడు' మాత్రమే కాదు- ఆత్మీయుడు.., ఆత్మబంధువు కూడాను.

అతని జ్ఞాపకాలు తలచుకుంటే మనసు భారమై, ఆలోచనలు తేనెటీగల్లా చుట్టుముట్టి హృదయాన్ని అతలాకుతలం చేస్తుంటాయి. అతనితోటి ఆ తీపి అనుభవాలు, కమ్మని జ్ఞాపకాలు చీకటివెలుగుల చక్రభమణంలా పరిభ్రమిస్తూ నాతో సహచర్యం చేస్తూ ఉంటాయి. భౌతికంగా నాకు దూరమైనా- నాలో అతను చిరంజీవి!

"బంగారం... నువ్వు నిజంగా బంగారానివే! నీ బంగారాన్ని నాకు పంచి ఇవ్వకూడదూ!" అంటూ హోటల్‌లో పిండి రుబ్బే నాతో సరసాలాడేవాడు.

"పోవయ్యా! నీ మగబుద్ధి పోనిచ్చుకున్నావు గాదు! నాతో నీకు సరసాలేంటి చెప్పు? కూటికి టికాణా లేనిదాన్ని... నా కింత తిండి పడేస్తే తిని పోతాను!" అంటూ రుబ్బిన పిండిని ప్రక్కనపెట్టి చేతులు కడుక్కొని లేచేదాన్ని.

"నిజంగానే బంగారూ... నువ్వంటే నాకు ప్రాణం! నువ్వు ఊపిరి లూదకపోతే ఈ ప్రాణం పోతుందేమో! నీ అందం వెన్నెల్ని వెక్కిరిస్తుంటే... సొగసు చంద్రుణ్ణి చిన్నబుచ్చుతోంది. నీ లావణ్యం నా తనువును తట్టిలేపుతోంది. మన వలపు జాతరలోని అమ్మోరివి నీవు!"

నాకంటూ ఎవరూ లేక మానసికంగా చితికిన నేను- చేసేపని ఏదైనా భావుకతతో కూడిన ఆ మాటలకు పొంగిపోయేదాన్ని.., ఆ చల్లనినీడలో ఆశల సౌధాన్ని నిర్మించుకొనేదాన్ని!

తనకంటూ ఎవరూ లేని జంగయ్య- ఆ ఊరిచివర చిన్నహోటల్ పెట్టుకుని జీవితాన్ని సాగించేవాడు. చిన్నతనంలో తల్లితండ్రులు కాటికి చేరిపోయారు. 'నా' అన్న వారెవరూ లేని అతను- సమాజంలోని స్వార్థం, సంకుచితత్వాలకు రాటుదేలి రాయిలా మారిపోయాడు. ఎవరినీ లెక్కచేయని మనస్తత్వం, తప్పతాగినా తానేమిటో మరువని వ్యక్తిత్వంతో నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాడు.

ఒకసారి హోటల్‌లో పనిచేస్తూండగా... ప్రమాదవశాత్తూ సలసలా కాగిన నూనె అతని శరీరం మీదపడి చర్మం కాలిపోయింది. చేసే వృత్తిని బట్టి, శరీరాకృతిని బట్టి అతన్ని అందరూ మొరటుగానో, కటువుగానో ఊహించుకుంటూ ఉండేవారు. సున్నితమైన అతని ఆంతర్యం ఏమిటో తెలుసుకోవడానికి నాకొక్కదానికే అవకాశం కలిగించాడా దేముడు!

మానని గాయాలతో అల్లాడుతుంటే దరిచేరి అతనికి సహాయం అందించడానికి ఎవరూ తోడు లేకపోయారు.

ఎందుకో అతని స్థితికి జాలి కలిగింది... తోచిన సహాయం చేశాను.

కోలుకున్న జంగయ్య నాపట్ల ఎంతో కృతజ్ఞతను కనపరిచాడు.

"జంగా! కాస్తో కూస్తో చదువుకున్నవాడివి. మంచీచెడ్డలు నీకు తెలుసు... నా మాటకు విలువిస్తానంటే నిన్ను ఒకటి కోరుతా!"

"........................."

"నీవు ఆ త్రాగుడు మానేయకూడదూ?!"

ఏమనుకున్నాడో, ఏమిటో... మళ్లీ తాగిన స్థితిలో నాకంట పడలేదు.

అతని మనసులో ఏముందో తెలియదు గానీ, ఒకసారి దోసెడు మల్లెపూలు తెచ్చి నా తలమీద పోశాడు. ఆ క్షణంలో నా గుండెలో పరకాయ ప్రవేశం చేసి, ఆప్యాయతతో మనసును స్పృశించాడు.

హృదయపు తోటలో పారిజాతమే గుబాళిస్తుంటే- వయసు వికసించింది. తనువు 'తోడు' కోరుకుంది. ఆ క్షణంలో ఎందుకో- అతనికి నన్ను నేనే సమర్పించుకోవాలని మనసు ఉవ్విళ్ళూరింది.

"బంగారూ! నువ్వంటే నాకిష్టం... నా గుండె కోవెలలో నిన్ను దేవతగా నిలుపుకుంటాను- నువ్వు వరమిస్తానంటే..!" అంటూ ఆరాధనగా చూశాడు.

చిన్నతనం నుండి ఏ ప్రేమాభిమానాన్ని చవిచూడని నేను- ఆ మాటలకి చలించిపోయాను. అతను కనబరుస్తున్న అనురాగానికి, ఆప్యాయతకు ఉప్పొంగిపోయిన గోదారిలా నా హృదయం పరవళ్ళు తొక్కింది.

మొత్తానికి ఆ ఊరిలోని రాధాకృష్ణుల కోవెలలో దండలు మార్చుకున్నాము.

ఆహ్లాదకరమైన వాతావరణం... గలగల పారే ఆ జీవనది... రాధాకృష్ణుల మందిరం... తివాచీ పరచినట్లుండే పచ్చని గడ్డి... చిరుగాలికి సంబరపడుతూ తలలూపే చెట్లూ, చేమలూ... నాకెంతో నచ్చిన ఆ పరిసరాల్లో నన్నెంతో ప్రేమిస్తూ, అపురూపంగా చూసుకునే అతని సాంగత్యంలో నా జీవితం ఆనందమయంగా సాగిపోతూ ఉండేది.

మా చిన్నహోటల్ ముందు ఆ చిన్నఊరులోని పెద్దపెద్ద హోటల్స్ కూడా వెలవెలబోయేవి. అందరూ మాది 'అభిమానాన్ని రంగరించిన స్టార్‌హోటల్' అంటుండేవారు. "నీవు జంగడు జీవితంలో అడుగుపెట్టిన తరువాత అతనిలో చాలా మార్పు వచ్చిందమ్మాయ్!" అంటుండేవారు కొందరు.

అతను సప్లయర్... నేను క్యాషియర్!

వచ్చిన కస్టమర్సుకి ప్రేమగా అన్నం పెట్టేవాళ్ళం, ఆప్యాయంగా సాగనంపేవాళ్ళం! ఒక్కమాటలో చెప్పాలంటే... ఊరికి దూరంగా చిక్కటి చెట్ల గుబురుల్లో నేషనల్ హైవే మీద వున్న మా 'కాకా హోటల్' అక్కడివారి జీవితంలో ఒక భాగం! వచ్చేపోయే వాహనదారులందరూ ఫలహారం కోసం అక్కడ ఆగేవారు.

తెగిన గాలిపటం లాంటి ఈ బ్రతుక్కి జంగయ్యలాంటి మనసున్న మనిషి ఆలంబన కావడం నా జీవన భాగ్యం!

కాలక్రమంలో మేము ఇద్దరం- ముగ్గురమయ్యాం. 'సూరి' తనలా కాకుండా పెద్దచదువులు చదివి, పైఉద్యోగాలు చేసి, మంచి ప్రయోజకుడు కావాలని ఆశపడేవాడు.

మా దాంపత్యం రాగమయంగా సాగుతున్నప్పుడు- కలిసిరాని కాలంలోని ఓ కాళరాత్రి- ఆ నగర ప్రముఖుడి కొడుకు... ఎవరో అమ్మాయిని కారులో అక్కడికి బలవంతంగా తీసుకొచ్చాడు.

ఆమె తప్పించుకొనేందుకు ప్రాధేయపడి పెనుగులాడుతోంది... "బాబుగారూ! నేను అటువంటిదాన్ని కాదు. వారంరోజుల్లో నాకు పెళ్ళి జరగబోతోంది. దయచేసి నన్నేమీ చేయకండి. నన్ను వదిలిపెట్టండి!" కాళ్ళు పట్టుకొని ప్రాధేయపడుతోంది.

పీకల దాకా తాగివున్న ఆ కామాంధుడు లేడిపిల్లలాగ బెదిరిపోతున్న ఆమె మీదకు పులిలా దూకుతూ... "ఈ ఊరునాది, మనుషులు నావాళ్ళు, నా కెదురే లేదు! నా వేటలో చిక్కావే పిట్టా... ఇక తప్పించుకోలేవు!" అంటూ పాశవికంగా ఆ పిల్లను లోబరచుకొన్నాడు.

ఆ చెట్లతోపుల లోనికి తీసికెళ్లి ఆమె బట్టల్ని చించి నానాబీభత్సం చేస్తూంటే... తప్పించుకోవడానికి ఆక్రందిస్తూ విఫలయత్నం చేసింది.

ఆ భయంకరమైన దృశ్యాన్ని చూసినవారు- 'మంత్రిగారి అబ్బాయి జోలికిపోతే ఏ విధమైన ముప్పు వస్తుందో..?!' నని భయపడుతూ ప్రక్కకు పారిపోయారు.

బెంచీలు సర్దుతున్న జంగయ్యలోని రక్తం సలసలా మరిగిపోయింది.

ఇంతకాలం గుండెగదుల్లో అణచిపెట్టిన కరకుదనం ఒక్కసారి కర్తవ్యాన్ని గుర్తుచేసింది. నేను 'వద్ద'ని వారిస్తున్నా- వినిపించుకోలేదు. వీరసింహంలా వెళ్లి అతనితో కలబడ్డాడు.

"ఏరా... నాతోనే తలబడుతున్నావు? ఒళ్ళు కొవ్వెక్కిందా? ఏదో కేసులో ఇరికించి నిన్ను బొక్కలో తోయిస్తాను... జాగ్రత్త!" రౌద్రంగా కళ్ళురిమి చూశాడు.

జంగయ్య అతన్ని గట్టిగా అదిమిపట్టి ప్రక్కకు లాగడానికి ప్రయత్నించాడు.

జంగయ్యను ఒక్క నెట్టు నెట్టి మళ్లీ వాడు అబలని ఆక్రమించుకోబోయాడు.

వెంటనే జంగయ్య పక్కనేవున్న పెద్ద బండరాయి నెత్తి వాడి తల పగులగొట్టాడు.

అంతా కనురెప్పపాటులో... క్షణంలో జరిగిపోయింది!

ఆ పాపాత్ముడు గిలగిలా తన్నుకుంటూ ప్రాణాలు విడిచాడు.

'మంత్రిగారి అబ్బాయి చనిపోయాడు' అన్న వార్త ఊరంతా దావానలంలా వ్యాపించింది.

ఎక్కడ చూసినా బీభత్సంగా ఉంది.

పెద్దపెద్ద గూండాలు జంగయ్యను తరుముకొచ్చారు. అనునిత్యం గూండాల స్వైరవిహారంతో రెండురోజుల పాటు ఆ ప్రాంతమంతా అట్టుడికిపోయింది. అకృత్యాలు పెచ్చరిల్లిపోయాయి. అదుపు చేసే నాథుడే లేడు.

ఎదురుతిరిగి ఎదురుతిరిగి అలసిపోయిన జంగయ్య- ఒళ్ళంతా సెగలుకక్కే జ్వరంతో పడున్నాడు.

ఆ మూడోనాటి రాత్రి గూండాలు హోటల్ మీద దాడిచేసి విధ్వంసం సృష్టించారు. ఒక్క వస్తువూ మిగల్లేదు.

"వీడేనా జంగయ్య? ఏరా... అంత మొనగాడి వయ్యావా? మా నాయకుణ్ణే చంపేస్తావా?!" అంటూ పొడిచి పొడిచి చంపారు.

నా సర్వస్వం... నా పెన్నిధి... రక్తపు మడుగులో కొట్టుకుంటుంటే- దగ్గరకు వెళ్లలేని దయనీయ స్థితి!

కాసేపు అక్కడేవుంటే వాళ్ళ దృష్టి నా మీద, నా బిడ్డ మీద పడేదే! ప్రాణాలు అరచేత పెట్టుకొని గాఢనిద్రలో ఉన్న బిడ్డను చంకనెత్తుకొని ఎవరో వెంబడిస్తున్నా ఒళ్ళు జలదరించే భయంతో కట్టుబట్టలతో ఊరు విడిచి వచ్చేశాను.

జంగయ్యా, అతని జ్ఞాపకాలూ ఒక తీయని కల లాగా నా మనసులో సజీవంగా ఉన్నాయి. చివరకు నాకు మిగిలింది- నా కొడుకు, జంగయ్యతోటి అనుభూతులు! ఆ ఊరూ... ఆ హోటల్... గలగల పారే ఆ నది... రాధాకృష్ణుల మందిరం... పచ్చని ఆ ప్రాంతం... ఆ చెట్లూ, చేమలూ... వాటిమధ్య జంగయ్యతో సహజీవనం...! ఈ ఊపిరి ఉన్నంతవరకూ ఆ ఊసులు ఆకుపచ్చని జ్ఞాపకాలే!

'చిరునవ్వుల పరిమిస్తావా... మరుజన్మకు తోడుంటావా!
మనసు పూదోటలో మల్లెలు పూయిస్తే... మననం చేసుకుంటూ మరణిస్తా!'

అతని నోటి తీయని ఆ మాటతో ఎప్పుడూ నా మనస్సు ద్రవిస్తుంటుంది.

ఇప్పుడు సూరి పెరిగి కొంచెం పెద్దయ్యాడు. కాలేజీ చదువుకొచ్చిన వాడు- తన పుట్టిన ఊరిని చూడాలని పదేపదే అడుగుతున్నాడీ మధ్య!

నాకూ ఒకసారి చూడాలనిపించి బయలుదేరాను.

తీరా అక్కడికి వెళ్లేసరికి... మనసు ఎందుకో చివుక్కుమంది. అదృష్టవశాత్తూ నన్ను ఎవంరూ గుర్తుపట్టలేదు. ఇప్పుడు ఆ చెట్లూ, చేమలూ కొట్టేశారు. పచ్చని ఆ పరిసరాలన్నీ ఇప్పుడు మరోలా ఉన్నాయి.

నా జంగయ్య ఎక్కడ కుప్పకూలి ప్రాణం వదిలాడో- ఆ ప్రాంతం ఇప్పుడు కనుమరుగై పోయింది. అక్కడ మంత్రిగారి కొడుకు జ్ఞాపకార్థం పెద్ద మెమోరియల్ నిర్మించారు. ఆ స్మారకస్థలం నిమిత్తం ఆ ప్రాంతం మొత్తాన్ని ఆక్రమించారు. కొన్ని కోట్లు ఖర్చుచేసి ఆ యువనాయకుని పేరిట స్థూపం విగ్రహాలు నిర్మించారు. ఒక అభాగ్యురాలిని మానభంగం చేస్తూ ప్రాణం వదిలిన ఆ దుర్మార్గుణ్ణి మంచిగా చిత్రీకరించారు. ఆమెను రక్షించబోయిన నా భర్తను దోషిగా చూపించారు.

"కిరాయి మూకల చేతిలో వీరమరణం పొందిన యువనాయకుడు... అమర్ రహే!"

"నిస్వార్థ యువనాయుకుడు, సంఘ సేవకుడు, నిజాయితీపరుడు, పేదల పాలిటి పెన్నిధి, పరోపకారి అయిన మహేష్ బాబు త్యాగజీవి! అమరజీవి!" అని పెద్దపెద్ద శిలాఫలకాలు వెలిశాయి.

చాలామంది ఆ స్మారక మందిరాన్ని సందర్శించి వెళుతున్నారు.

మా అనురాగ మందిరం... మా ఆశల హరివిల్లు... మానవత్వం పరిమళించిన మమతల పొదరిల్లు... ఏవీ? చిన్నచేపను పెద్దచేప మింగేసింది. ధనం, అధికారబలం గల పీడకుల చేత అనాదిగా జరుగుతున్న దోపిడీ ఇది! అన్యాయాన్ని ఎదిరించి నా భర్తకు చరిత్రపుటల్లో స్థానమే లేదు. కారణం... పేదరికంతో మేము బలహీనులం కావడం! అదే ఒక రాజకీయ నాయకుని కొడుకై అకృత్యాలు, అంతులేని ఆగడాలు చేసినా అతనికి ఉన్నతస్థానం ప్రదర్శింపబడుతోంది. ఇదీ వర్తమాన చరిత్ర... నేటినిజం..!

జంగయ్య ఆనవాళ్ళు ఇక్కడ పూర్తిగా చెరిగిపోయాయి. దుర్మార్గానికి మాత్రం బ్రహ్మరథం పట్టారు. ఆనాటి అందాల్ని, ప్రకృతి శోభని కళ్ళారా చూసుకోవాలని కోరుకున్న అది కలలాగే మిగిలిపోయింది.

ఈ స్మారక మందిరం, దానిచుట్టూ వందిమాగదుల్లా నిలబడిన ఆకాశ హర్మ్యాలు- కాసేపు నేనిక్కడ ఉంటే నా పసిడికలలను కూడా కొల్లగొడతాయి. కొన్ని ఊహలు అనుభూతుల వరకే పరిమితం! ఆ అనుభూతుల్ని సాకారంగా సాక్షాత్కరించుకోవాలంటే సాధ్యపడదని తెలిసింది.

సూరితో అనవసరంగా ఇక్కడికి వచ్చి గుండెలోని మధురమైన అనుభూతుల్ని చెరిపేసుకున్నాననే వేదనతో విరాగంగా వెనుదిరిగాను.

కథా నిలయం
5539
శ్రీకాకుళం